
సాక్షి ఒడిశా

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.7,70,923
బంగారం	5 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి	72 గ్రాముల 700 మిల్లీ గ్రాములు


- భువనేశ్వర్/పూరీ

నీటిలో మునిగి ఇద్దరు మృతి



చెరువులో స్నానం చేస్తున్న సమయంలో జారిపడడంతో ఇద్దరు మృతి చెందిన ఘటన బుధవారం జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి అంచల గ్రామ పంచాయతీ బిరాహండి గ్రామంలో చోటుచేసుకుంది.

- 8లో



మహా శివరాత్రికి సన్నాహాలు

భువనేశ్వర్‌లోని లింగరాజు దేవస్థానం ఆలయ కార్యాలయ ఆవరణలో శివరాత్రి సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

రాజమాత సుజ్ఞాని దేవికి నివాళి



రాజమాత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీకే పాండ్యన్ తదితరులు

బరంపురం: గంజాం జిల్లాలోని కళ్లికోట్‌లో రాజమాత వంశీయులు దివంగత రాజమాత సుజ్ఞాని దేవి సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమాత చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో 5టీ చైర్మన్ కార్తికేయ పాండ్యన్, రాష్ట్ర ఆర్థిక మంత్రి విక్రమ్ కేసరి అరుక తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీతో ఒకరు అరెస్టు



తుపాకీతో పోలీసులకు చిక్కిన నిందితుడు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మునిషిగా పంచాయతీ పరిధి కబడాశిల్ గ్రామ సమీపంలో ఒక వ్యక్తి నుంచి పోలీసులు నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం కాసీపూర్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన కబడాశిల్ గ్రామస్తుడు మడమా మాఝి (54) అనే వ్యక్తిని తనిఖీ చేయగా, అతని వద్ద నాటు తుపాకీ లభించింది. దీంతో అతడిని అరెస్టు చేసి బుధవారం కోర్టుకు తరలించారు.

నాటుసారా సామగ్రి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట

బరంపురం: గంజాం, గజపతి జిల్లాల సరిహద్దు లకాడి అటవీ ప్రాంతంలో బరంపురం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన నాటుసారా సామగ్రి, ఊట బెల్లం స్వాధీనం చేసుకున్నారు. బరంపురం ఎక్సైజ్ అధికారి రామచంద్ర మిశ్ర తెలిపిన వివరాల మేరకు.. లకాడి అటవీ ప్రాంతంలో నాటుసారా సామగ్రి నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో బరంపురం ఎక్సైజ్ విభాగం దిగపండి అటవీ అధికారులు, దిగపండి పోలీసు అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో దాడిచేసి అక్రమంగా నిల్వ ఉంచిన సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

52 కేజీల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: జిల్లాలోని మాచ్‌ఖండ్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న 52 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు మాచ్‌ఖండ్ పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే శెఠి నేతృత్వంలో లమ్తాపుట్ జంక్షన్‌లో తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో వేగంగా వస్తున్న ఒక కారును ఆపేందుకు ప్రయత్నం చేయగా ఆపకుండా వెళ్లిపోయారు. వెంటనే పోలీసులు ఆ కారును వెంబడించగా సమీప అటవీ ప్రాంతంలో కారుని వదిలి స్మగ్లర్లు పరారయ్యారు. దీంతో కారులో పరిశీలించగా 2 బస్తాల్లో గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి సీజ్‌చేసి కోర్టుకి తెలియజేశారు.

బీజేపీలో జోష్...!

- పార్టీలో చేరిన గోపాల్‌పూర్ ఎమ్మెల్యే ప్రదీప్ కుమార్



బీజేపీ నాయకులతో గోపాల్‌పూర్ ఎమ్మెల్యే ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి

భువనేశ్వర్: సీఎం నవీన్ పట్నాయక్ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో ప్రధాన ప్రతిపక్షం బీజేపీలో జోష్ పెరిగింది. గోపాల్‌పూర్ నియోజకవర్గం బీజేడీ ఎమ్మెల్యే డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సమాల్, ఇతర సీనియర్ నాయకుల సమక్షంలో ఆయన బీజేపీ కండువా కప్పుకున్నారు. రాష్ట్రంలో త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆయన పార్టీ ఫిరాయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. నాలుగేళ్ల క్రితం బిజూ జనతా దళ్ (బీజేడీ) నుంచి ఆయనను బహిష్కరించారు. ఈ నెల 15న బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌ను ఆయన కలిశారు. దీంతో ఆయన పార్టీ మారుతున్నట్లు ముందుగానే సంకేతాలు వచ్చాయి.

స్వాగతిస్తున్నాం

బీజేపీలోకి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహిని స్వాగతిస్తున్నామని మన్మోహన్ సామల్ తెలిపారు. ఆయన రాష్ట్ర మాజీ మంత్రిగా బాధ్యతలు నిర్వహించిన ఎమ్మెల్యే, వివిధ రాజకీయ ఒత్తిళ్ల బాధితుడుగా పేర్కొన్నారు. ప్రదీప్ కుమార్ భారతీయ జనతా పార్టీలోకి రావడంతో గంజాంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో బీజేపీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశం అభివృద్ధి చెందుతోంది

బీజేపీలో చేరిన పాణిగ్రాహి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశలో పయనిస్తోందని తెలియజేశారు. ఈ తరుణం రాష్ట్రంలో రాజకీయ మార్పుకు అనుకూల సమయమన్నారు. బలమైన ఒడిశాతో శక్తివంతమైన భారత్‌ను నిర్మించాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. ప్రాంతీయత కంటే జాతీయవాదానికి ఎదగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ దిశగా బీజేపీ కృషి చేస్తోందని తెలియజేశారు. బలమైన ఆర్థిక వ్యవస్థవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టి సారిస్తున్నారు. ఆయన పాలన దక్షత దేశ ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతోందని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వాన్ని పారదోలేందుకు రాజకీయ మార్పు రావాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన రాజకీయ జీవనం అటల్ బిహారీ వాజ్‌పేయి మద్దతుతో ప్రారంభించారని, అనంతరం బీజేపీతో తెగతెంపులు చేసుకున్నారని గుర్తు చేశారు. కాగా ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహిని 2020 సంవత్సరం నవంబర్ 29న బిజూ జనతా దళ్ పార్టీ నుంచి బహిష్కరించారు. కళంకిత ఐఏఎస్ అధికారి అభయ్ కాంత్ పాఠక్ కుమారుడు ఆకాష్ కుమార్ పాఠక్‌తో అతని అనుబంధం, ఉద్యోగాల ఎరతో మోసానికి సంబంధించిన ప్రమేయం వెలుగులోకి రావడంతో అతనిపై ఈ చర్య చేపట్టినట్లు బీజేడీ అప్పట్లో ప్రకటించింది.

● అభినందనలు



రాష్ట్రం నుంచి దేబాశిష్ సామంత్రాయ్, సుభాశిష్ ఖుంటియాలు బీజేడీ తరుపున రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో వీరు సీఎం నవీన్ పట్నాయక్‌ను భువనేశ్వర్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. వీరికి సీఎం అభినందనలు తెలియజేశారు. - భువనేశ్వర్

ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు



ఆమె ఒడిశా పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొరాపుట్: బీజేడీ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని మనబార్ గ్రామంలో ఏర్పాటు చేసిన అమో ఒడిశా–నవీన్ ఒడిశా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. 25 ఏళ్ల క్రితం తినడానికి తిండి దొరకని ఒడిశాని చూశారన్నారు. కానీ ప్రస్తుతం ఒడిశాలో పండిస్తున్న ఆహార ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతున్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలతో ఒడిశా పోటీపడుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో కొరాపుట్ పురపాలక సంఘ అధ్యక్షుడు లలెటెందు రంజన్ శెటి, సీనియర్ బీజేడీ నాయకుడు ప్రసాద్ బిడ్డిక పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు నగదు పురస్కారం

భువనేశ్వర్: హాకీ క్రీడా రంగంలో రాష్ట్రానికి విశేష గుర్తింపు తీసుకొచ్చిన క్రీడాకారులకు ప్రభుత్వం ప్రత్యేక నగదు పురస్కారం ప్రకటించింది. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి హాకీ క్రీడల్లో అత్యుత్తమ విజయాలను ప్రదర్శించిన విజేతలకు ఈ పురస్కారంతో సత్కరిస్తారు. దీనిలో భాగంగా అమిత్ రోహిదాస్, దీప్ గ్రేస్ ఎక్కాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3,75,000 చొప్పున నగదు బహుమతి ప్రకటించింది. చెన్నైలో జరిగిన 2023 పురుషుల ఆసియా ఛాంపియన్స్ షిప్ ట్రోఫీ పోటీలో అమిత్ రోహిదాస్, 2023 జార్ఖండ్‌లో జరిగిన మహిళల ఆసియా ఛాంపియన్స్ షిప్ ట్రోఫీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన దీప్ గ్రేస్ ఎక్కా ప్రతిభకు గుర్తుగా ఈ నగదు పురస్కారం ప్రకటించారు. మస్కట్ ఒమన్‌లో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ మహిళల ప్రపంచ కప్ – 2024 తొలి ఎడిషన్‌లో రజత పతకాన్ని గెలుచుకున్న భారత మహిళల హాకీ జట్టులో, రాష్ట్ర క్రీడాకారిణులకు ప్రత్యేక నగదు పురస్కారం కోసం ఎంపిక చేశారు. ఈ జాబితాలో మరియానా కుజుర్, జ్యోతి ఛత్రి, అజ్మీనా కుజుర్ ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికి రూ.12,50,000 నగదు పురస్కారం ప్రదానం చేస్తారు.

కెంజొహర్‌గొడొ ప్రజలకు తీపి కబురు

భువనేశ్వర్: కెంజొహర్‌గొడొ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఈ ప్రాంతీయులకు ఢిల్లీ పయనానికి ప్రత్యేక రైలు సౌకర్యం లభిస్తుంది. కెంజొహర్‌గొడొ మీదుగా భువనేశ్వర్ నుంచి న్యూఢిల్లీకి రైలు రవాణాకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని స్థానిక శాసన సభ్యుడు మోహన్ చరణ్ మాఝికి రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లేఖ ద్వారా తెలియజేశారు. గతేడాది నవంబర్ 8వ తేదీన కెంజొహర్‌గొడొ ప్రాంతీయులకు న్యూఢిల్లీకి ప్రత్యేక రైలు సౌకర్యం కోసం ఎమ్మెల్యే అభ్యర్థించారు.

కళాకారులను ప్రోత్సహించేందుకే ‘కళాసృష్టి’



మాట్లాడుతున్న భళ్లమూడి నాగరాజు



హాజరైన కళాభిమానులు

రాయగడ: కళాకారులను ప్రోత్సహించేందుకు, కళలను అభివృద్ధి చేసేందుకు ఏర్పడిన సంస్థే కళాసృష్టి అని సీనియర్ పాత్రికేయుడు, ప్రముఖ రచయిత భళ్లమూడి నాగరాజు అన్నారు. స్థానిక హోటల్ స్వాగత్ లైన్‌లోని రామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో కళాసృష్టి 22వ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత నటుడు, దర్శకుడు జీఆర్ఎస్ ఠాగూర్ ప్రారంభించిన ఈ సంస్థకు మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తుండడం అభినందనీయమని కొనియాడారు. యువ కళాకారులు ముందుకు వస్తే సంస్థ సేవలు మరింత ఉన్నతంగా అందించే అవకాశం కలుగుతుందని ఆకాంక్షించారు. సంస్థ కార్యదర్శి పిల్లల శంకరరావు మాట్లాడుతూ సంస్థ ప్రారంభం నుంచి ప్రతీఏటా నాటికలు ప్రదర్శించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాయగడ రచయితల సంఘం అధ్యక్షుడు టీవీఎస్ఆర్ అప్పారావు, స్పందన సాహితీ, సంస్కృతిక సంస్థ కార్యదర్శి పి.తులసీదాస్, డాక్టర్ బాబురావు మహంతి, షార్ట్ ఫిల్మ్‌ల నిర్మాత గొట్టా సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



త్రినాథ్ గౌడ మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి ప్రాంతంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. ఉదయం 9 గంటల సమయంలో బొయిపరిగుడ- కుంద్ర రహదారిలో ట్రాలర్ ఢీకొనడంతో మయినపడ గ్రామానికి చెందిన రామచంద్ర పరిచ కుమారుడు దీపక్ పరిచ(12) దుర్మరణం చెందాడు. చయినపడ గ్రామం గౌడవీధిలో ఉన్న తన పెదనాన్న ఇంటి నుంచి తమ ఇంటికి వస్తున్న దీపక్‌ను బొయిపరిగుడ నుంచి కుంద్ర వెళ్తున్న ట్రాలర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. బొయిపరిగుడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బొయిపరిగుడ తహసీల్దార్ స్వప్నరాణి చౌదరి రెడ్‌క్రాస్ నిధి నుంచి దీపక్ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మధ్యాహ్నం విజయవాడ- రాంచీ 326 జాతీయ కారిడార్‌లో కొట్ట గ్రామం సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. మరణించిన వ్యక్తి నవరంగపూర్ జిల్లా మైదల్‌పూర్ సమీప పకనగుడ గ్రామం త్రినాథ్ గౌడ(27) గా గుర్తించారు. అతడు మంగళవారం పాత్రోపుట్ లోగల తన బంధువుని ఇంటికి వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి వస్తున్న సమయంలో బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో మృతి చెందాడు.

వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు



శిక్షణ పొందుతున్న ఆర్‌ఆర్‌టీ బృందం సభ్యులు



రక్షణ కవచంతో ఆర్‌ఆర్‌టీ సభ్యుడు

భువనేశ్వర్: రాష్ట్రంలో వన్య ప్రాణుల సంరక్షణకు ఒడిశా అటవీ శాఖ నడుం బిగించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రతిస్పందన బృందాలను రంగంలోకి దింపుతోంది. రాష్ట్రంలో 6 అటవీ మండలాల్లో మానవ – వన్యప్రాణుల సంఘర్షణలను తగ్గించడానికి, ఆపదలో ఉన్న జంతువులను రక్షించడానికి 18 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను (ఆర్‌ఆర్‌టీ) ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆర్‌ఆర్‌టీ వర్గాలకు శిక్షణ ప్రారంభమైంది. నగర శివారు నందన్ కానన్ జూలాజికల్ పార్క్‌లో తొలి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆర్‌ఆర్‌టీలకు ట్రాంక్విలైజర్, రక్షణ కవచంతో ఆధునిక తుపాకులు, ట్రాప్ కెమెరాలు, ట్రాకింగ్, మానిటరింగ్ సంబంధిత పరికరాల వాడకంపై శిక్షణ ఇస్తున్నారు. పంజరం, బోను ఇతరేతర పరికరాల రవాణాకు అనుకూలమైన ప్రత్యేక వాహనాలను కేటాయిస్తారు. చిరుత పులులు, ఎలుగుబంట్లు, పులులు, ఇతర చిన్న జంతువులకు ఎక్కువ హాని కలిగించకుండా రక్షించడం ఈ చొరవ లక్ష్యం. ప్రతీ ఆర్‌ఆర్‌టీ బృందంలో యువ అటవీ సిబ్బంది, రేంజర్ స్థాయికి చెందిన ఒక టీమ్ లీడర్ ఉంటారు. ఏర్పాటు చేసిన 6 బృందాల్లో ఒక బృందం ప్రత్యేకంగా నందన్ కనన్ జూ కోసం పరిమితం. ఫోన్ కాల్ వచ్చిన గంట నుంచి గంటన్నర సమయంలోపు సంఘటనా స్థలానికి చేరుకోవాలని ఆర్‌ఆర్‌టీ బృందాలకు సూచిస్తున్నారు. ఆర్‌ఆర్‌టీలకు చందక వన్య ప్రాణుల అభయారణ్యం గొడిబడి ప్రాంగణంలో థియరీ తరగతులు, నందన్ కానన్ జూలాజికల్ పార్క్‌లో ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ మార్చి నాటికి ముగుస్తుంది. వెంబడి ఏప్రిల్ 1 నుంచి వారి సంబంధిత డివిజన్లలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీములు పనిచేస్తాయని ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ దేబీదత్త బిశ్వాల్ తెలిపారు.

పాఠశాల శిలాఫలకం ధ్వంసం



శిలా ఫలకాన్ని పడగొడుతున్న సామంతరాయ్ తదితరులు

జయపురం: సమితిలోని కొంగ గ్రామ పంచాయతీ పకనగుడ గ్రామంలో 5టీ మో స్కూల్ నిర్మాణంలో అక్రమాలు జరిగాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్ ఆరోపిస్తున్నారు. దీనికి నిరసనగా మంగళవారం రాత్రి ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని గ్రామస్తులతో కలసి ధ్వంసం చేశారు. పాఠశాల నిర్మాణానికి టెండరు పిలువకుండా ప్రభుత్వ సొమ్మును స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. స్కూల్‌లో ఎటువంటి నిర్మాణం జరుగలేదని, శిలాఫలకం పెట్టి డబ్బు స్వాహా చేస్తున్నారని ధ్వజమెత్తారు. వెంటనే ప్రభుత్వం ఒక టీమ్‌తో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

‘విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి’



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రధాన్, డీఈవో ప్రదోష్ కుమార్ నాయక్ ఇతరులు



ఉత్తమ ఉపాధ్యాయుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం



కళాకారుల జానపద నృత్యం

పర్లాకిమిడి: జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యనందిచాలని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ కోరారు. బెత్తగుడలోని జిల్లా ముఖ్య శిక్షాధికారి కార్యాలయంలో జిల్లాస్థాయిలో వివిధ సమితి కేంద్రాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి పురస్కారాలను బుధవారం అందజేశారు. మొత్తం 8 విభాగాల్లో 1,124 మందికి పురస్కారాలు అందజేశారు. బ్లాక్ శిక్షా పురస్కారాలు 714, లీడర్‌షిప్ పురస్కారాలు 278, జిల్లా శిక్షా పురస్కారాలు 55, ప్రాథమిక ఉపాధ్యాయులు 7, మాధ్యమిక పురస్కారాలు 21, ప్రాథమిక విద్యాలయాలు 20, స్కూల్ పర్యవేక్షణ కమిటీలు 7, అల్యూమినీ 6 గురికి పురస్కారాలును అందజేశారు. డీఈవో ప్రదోష్ కుమార్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అదనపు డీఈవో మనోరంజన్ దొళాయి, జిల్లా సంక్షేమశాఖ అధికారి మమతా రాణి పరిడా, డైట్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ ప్రదీప్ జెన్నా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి మహానగర్ ఉత్సవాలు


మైదానంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక కళ్లికోట్ విశ్వ విద్యాలయం క్రీడా మైదానంలో మహానగర్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో మహానగర్ మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. ఈ మేరకు శుభ కుంభ స్థాపనకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈనెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో గోపాల పట్నాయక్, మాంకుడో తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక కోమటి వీధిలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఏకాదశి మంగళవారం రాత్రి స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించడానికి విచ్చేసిన పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావుకు ప్రధాన పూజారి భద్రం శ్రీనివాసాచార్యులు స్వామివారి తీర్థం అందజేసి పట్టువస్త్రాలతో సత్కరించారు. స్వామివారి కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు బరాటం నాగం కోరారు.

తూర్పుకాపు సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రాంబాబు

రేగిడి: ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా రేగిడి మండలంలోని కాగితాపల్లి గ్రామానికి చెందిన దూబ రాంబాబు ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. గ్రామస్తులతో పాటు బంధువులు, స్నేహితులు రాంబాబును అభినందించి మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని తూర్పు కాపుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని చెప్పారు.

పక్కాగా ఎన్నికల ఖర్చు లెక్క

- ఆర్డీఓ హేమలత


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురం: ఎన్నికల ఖర్చులను పక్కాగా లెక్కించాలని ఆర్డీఓ కె.హేమలత సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా సిబ్బంది మంచి పనితీరు కనబరచాలన్నారు. ఎన్నికల సిబ్బందికి మూడు దఫాలు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఎన్నికల వ్యయంపై పర్యవేక్షణకు ప్రత్యేక బృందాన్ని నియమించామన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సందేహాలున్నా శిక్షణలో నివృత్తి చేసుకోవాలన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో సహాయ పరిశీలకునిగా పనిచేసిన బీఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ డివిజనల్ అధికారి బి.సుందర్‌సురేష్ ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి పి.శ్రీరామ్ పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం సరఫరా

- సివిల్ సప్లయ్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ ఎస్.సుబ్బరాజు


గుమ్మలక్ష్మీపురంలోని గోదాంలో నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలిస్తున్న జోనల్ మేనేజర్ ఎస్.సుబ్బరాజు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్‌కార్డు లబ్ధిదారులకు పౌర సరఫరాల ద్వారా నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్నట్టు విశాఖపట్నం సివిల్ సప్లై కార్పొరేషన్ జోనల్ మేనేజర్ ఎస్.సుబ్బరాజు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం జీసీసీ మెయిన్ గోదాం (ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్)ను బుధవారం పరిశీలించారు. నిత్యావసర సరుకుల నిల్వలు, రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట గోదాం సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.

గిరిజనోత్పత్తుల పరిశీలన

భామిని: మండలంలోని మనుమకొండ వనధన్‌వికాస్ కేంద్రం (వీడీవీకే)లోని పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఎం.డి. సురేష్‌కుమార్, డి.ఎం.సంధ్యారాణి, ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి బుధవారం పరిశీలించారు. మార్కెటింగ్‌పై ఆరా తీశారు. గిరిజనోత్పత్తుల ప్యాకింగ్‌పై పలు సూచనలిచ్చారు. జీసీసీ ఆధ్వర్యంలో సరుకులు కొనుగోలుచేసి ప్రాసెసింగ్‌తో పాటు మార్కెటింగ్ చేస్తున్నట్టు వీడీవీకే సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ క్లస్టర్ కోఆర్డినేటర్ శేషగిరి, వెలుగు సీసీ కేశవరరావు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

మహా శివరాత్రికి సన్నాహాలు


లింగరాజు ఆలయం

భువనేశ్వర్: స్థానిక శ్రీలింగరాజు దేవస్థానం ఆలయ కార్యాలయ ఆవరణలో శివరాత్రి సన్నాహక సమావేశం గురువారం నిర్వహించారు. దీనిలో మహాశివరాత్రి ఉత్సవాల కార్యక్రమాలు ఖరారు చేశారు. అయితే సమావేశానికి సేవాయత్ వర్గం బొడు నియోగులు గైర్హాజరు కావడం చర్చనీయాంశమైంది. మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం మహాదీపదర్శనం. రాత్రి 10 గంటలకు ఈ దర్శనం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 7వ తేదీ అర్ధరాత్రి 2.30 గంటలకు ఆలయ తలుపులు తెరిచేందుకు నిర్ణయించారు. వేకువ జాము 3 నుంచి 3.30 గంటల మధ్య మహాదేవునికి మంగళ హారతి సమర్పిస్తారు. అనంతరం ఉదయం 4గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు భక్తులకు సర్వ దర్శనం లభిస్తుంది. రోష హోమం ఉదయం 6.30 గంటలకు, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శుద్ధి, మధ్యాహ్నం 12 గంటలకు మహాస్నానం, అలంకరణ, 12.45 గంటలకు సూర్య పూజ, ద్వార పాలకుల పూజ, లింగరాజు, దేవేరులకు వల్లభసేవ, ధూపం సమర్పిస్తారు. లింగరాజు ఆలయం కార్యనిర్వహణ అధికారి (ఈవో) అధ్యక్షతన మహా శివరాత్రి ఉత్సవం సన్నాహక సమావేశం జరిగింది. బొడు నియోగుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి ఈ సమావేశానికి హాజరు కాలేదు. బ్రాహ్మణ నియోగులు, పూజా పండా నియోగులు, సమర్థ నియోగులు, ఒపాటియా ప్రతినిధులు, ఆలయం సూపర్‌వైజరు సమావేశానికి హాజరయ్యారు.

సీఎం నివాసం ముట్టడికి యత్నం

- పోలీసులతో మహిళా కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ


పోలీసులతో మహిళా కాంగ్రెస్ కార్యకర్తల వాగ్వాదం

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై మహిళా కాంగ్రెస్ సభ్యులు గురువారం నిరసన తెలిపారు. దీనిలో భాగంగా సీఎం నవీన్‌పట్నాయక్ నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. దీంతో వీరిని పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీనాక్షి బాహిణీపతి నేతృత్వంలో భారీ ఊరేగింపుగా నవీన్ నివాస్ వైపు ఆందోళనకారులు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అయితే కాంగ్రెస్ సభ్యులు పోలీసుల బారికేడ్లను అధిగమించేందుకు ప్రయత్నించడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ ఘర్షణ క్రమంగా తోపులాటకు దారి తీసింది.

ప్రజాస్వామ్యానికి విఘాతం

ఈ సందర్భంగా అల్కా లాంబా మాట్లాడుతూ.. తాము సీఎంను కలవాలనుకున్నామని తెలియజేశారు. అయితే పోలీసులు అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొన్నారు. సీఎం నవీన్ పట్నాయక్ తీసుకొచ్చిన మిషన్ శక్తి విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలోని మహిళా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. నిరసన ప్రదర్శనకు ముందు 3 వేల మందికిపైగా కాంగ్రెస్ మహిళా సభ్యులు రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయం ముందు గుమిగూడారు. రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో 50 శాతం పార్టీ టిక్కెట్లు మహిళలకే దక్కుతాయని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు.

తప్పిన పెను ప్రమాదం

భోగాపురం: మండల కేంద్రంలోని సిరిగుడి వారి కళ్లాల వద్ద నివాసముంటున్న సిరుగుడు కాసులమ్మ ఇంట్లో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

యూత్‌గేమ్స్‌లో ఆదినారాయణకు కాంస్యం



నెల్లిమర్ల రూరల్: ఈ నెల 19 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ యూత్ గేమ్స్-2023 పోటీల్లో నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ బట్టు ఆదినారాయణ కాంస్య పతకం సాధించాడు. 81 కేజీల విభాగంలో బుధవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న ఆదినారాయణ స్నాచ్ 135 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 160 కిలోలు..మొత్తంగా 295 కిలోల బరువును ఎత్తి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ప్రతిభ కనబరిచిన వెయిట్ లిఫ్టర్‌కు ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్పీటీసీ సన్యాశినాయుడు, కోచ్‌లు అర్జున్, మత్స సంతోషి అభినందనలు తెలిపారు.

ధ్వజ స్తంభానికి ఘన స్వాగతం


ప్రత్యేక లారీలో రాయగడకు చేరుకున్న ధ్వజస్తంభం


ధ్వజ స్తంభానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: సదరు సమితి అమలాభట్ట వద్దనున్న శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఈనెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరగనున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభం బుధవారం రాత్రి రాయగడకు చేరుకుంది. స్తంభాన్ని ప్రత్యేక లారీలో ఇక్కడికి తీసుకొచ్చారు. స్థానిక జగన్నాథ మందిరం వద్ద భక్తుల దర్శనార్థ కాసేపు నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మైలవరంలో సుమారు 46 అడుగుల పొడవు, 11 టన్నుల బరువు గల ఏకశిలతో రూపొందించారు. స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం కోలాటం, రామనామ కీర్తనలతో ఊరేగింపు కార్యక్రమం జరిగింది.

క్రీడాకారులకు అభినందనల జల్లు


క్రీడాకారులకు చెక్‌ను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో భాగంగా విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన పురుషుల జట్టు క్రీడాకారులను కలెక్టర్ నిషాంత్‌కుమార్ బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. అనంతరం విజేతలకు కప్‌తో పాటు రూ.3 లక్షల నగదు బహుమతి చెక్కును ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మరింత ప్రతిభను కనబరచి, జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి.టి.గాంధీ, శిక్షకులు తిరుపతిరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

పనులు త్వరగా పూర్తిచేయాలని గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజినీర్లను కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పనులపై కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. లక్ష్యాలకు, పూర్తిచేసిన పనులకు ఎక్కువ మొత్తంలో వ్యత్యాసం ఉంటుందని, ఈ పరిస్థితి మరల తలెత్తరాదన్నారు.

నీటిలో మునిగి ఇద్దరు మృతి

జయపురం: చెరువులో స్నానం చేస్తున్న సమయంలో జారిపడడంతో వరసకు అన్నా చెల్లెల్లు అయ్యే ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి అంచల గ్రామ పంచాయతీ బిరాహండి గ్రామంలో చోటుచేసుకుంది. మృతి చెందినవారు గ్రామానికి చెందిన జోగేశ్వర అమనాత్య కుమార్తె నబిన అమనాత్య(7), సదన అమనాత్య కుమారుడు రామకృష్ణ అమనాత్యలు(7)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎప్పటిలాగే తమ ఇంటి సమీపంలో ఉన్న చెరువులో స్నానం చేసేందుకు వారు బుధవారం వెళ్లారు. అయితే దురదృష్టావశాత్తు స్నానం చేస్తూ చెరువులో పడిపోయారు. మధ్యాహ్నం వరకు చిన్నారులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెదకడం ప్రారంభించారు. కాగా సుమారు 1 గంట సమయంలో వారు చెరువులో తేలుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. వెంటనే గ్రామస్తులు బయటకు తీసి, బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. వెంటనే వారిని పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. చిన్నారులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు


సరోజినీ పట్నాయక్(ఫైల్)


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, 4 సెల్‌ఫోన్లు

పర్లాకిమిడి: పట్టణంలోని తొమ్మిదో వార్డు కరణం వీధిలో ఇటీవల జరిగిన వృద్ధురాలి హత్యకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో కరణం వీధికి చెందిన అమిత్ పట్నాయక్, ప్రతీక్ పట్నాయక్, కాశీనగర్ సమితి కొల్లగాంకు చెందిన డొడో జెన్నా అలియాస్ మైఖెల్ ఉన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆదర్శ పోలీసుస్టేషన్ అధికారి ప్రశాంత్‌భూపతి కేసు వివరాలు బుధవారం వెల్లడించారు. గత నెల 21వ తేదీన సాయంత్రం సమయంలో నిందితులు వృద్ధురాలు సరోజినీ పట్నాయక్(72) ఇంట్లోకి చొరబడి దాక్కున్నారు. అర్ధరాత్రి తర్వాత ఆమె నిద్రపోతున్న సమయంలో బెడ్ రూమ్‌లోకి ప్రవేశించి నోరు మూసి చంపేశారు. అనంతరం ఆమె మెడలో బంగారం చైన్, చెవి పోగులు తీసుకొని పెరటి ద్వారం గుండా పారిపోయారు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు ఇంట్లో కారం జల్లారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కరణం వీధిలోని సీసీ టీవీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. శ్రీకాకుళం మణప్పురం గోల్డ్ ఫైనాన్స్‌లో నిందితులు బంగారాన్ని కుదువ పెట్టినట్లు నిర్ధారించారు. పట్టుబడిన ముగ్గురు నిందితుల్లో ఇద్దరు హతురాలి ఇరుగుపొరుగు వారు కావడం విశేషం. నిందితులను బుధవారం మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచి జైలుకు తరలించారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు


హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్

బరంపురం: స్థానిక బరంపురం క్రీడా మైదానంలో ఆల్ఫా స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి భువనేశ్వర్, గుణుపూర్ మధ్య హోరాహోరీగా మ్యాచ్ జరిగింది. మ్యాచ్ వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తరలి వస్తున్నారు.

ఉత్సాహంగా ఉరుసు ఉత్సవం

- తరలివచ్చిన భక్తజనం
- నగర పురవీధుల్లో సందడిగా బాబా సందల్
- లంగర్ ఖానాలో భక్తులకు దివ్య అన్నసమారాధన

విజయనగరం టౌన్:

విజయనగరం ఆధ్యాత్మిక చక్రవర్తి, హజరత్ సయ్యద్ షహీన్ షా బాబా ఖాదర్ వలీ 65వ మహా సూఫీ సుగంధ మహోత్సవాలు రెండోరోజు బుధవారం అంగరంగ వైభవంగా, ఉత్సాహంగా జరిగాయి. ఉదయం పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనం నిర్వహించారు. విజయనగరం దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ నేతృత్వంలో అశేషంగా భక్తులు బాబాను దర్శించుకున్నారు. దర్బార్ నుంచి నగర పురవీధుల్లో వేలాదిమంది బాబా సందల్ తీసుకుని వెళ్లి పూజలు నిర్వహించారు. సాయంత్రం తిరిగి దర్బార్‌కు తీసుకువచ్చి పూజలు చేశారు. ఉరుసులో ప్రధానమైన ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. ఫకీర్ మేళా ఖవ్వాలీలతో దర్బార్ షరీఫ్ నుంచి భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం లంగర్ ఖానాలో వేలాది మంది భక్తులకు దివ్య అన్నసమారాధన అర్ధరాత్రి వరకూ నిర్వహించారు. చీమలపాడు సూఫీ పీఠాధిపతి మహమ్మద్ ఖ్వాజా మొహియుద్దీన్ షా తాజ్ ఖాదరి మాట్లాడుతూ సాటి మనిషిని ప్రేమతో చూడాలని, అదే భగవంతుడిని చేరుకునే సరళమైన మార్గమని విశ్వసమాజానికి పిలుపునిచ్చారు.

బాబాను దర్శించుకున్నవారిలో..

సూఫీ సుగంధ మహోత్సవాల్లో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు, విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఈశ్వర్ కౌశిక్ దంపతులు బాబాను దర్శించుకున్నారు. అదేవిధంగా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్.జాన్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాలాడ ఆనందరావు, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ స్వాదిక్, రియాజ్‌లు బాబాను దర్శించుకున్న వారిలో ఉన్నారు. అదేవిధంగా శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులు బాబా దర్గాను దర్శించుకోగా దర్బార్ షరీఫ్ డాక్టర్ ఖలీల్‌బాబు వారికి స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు చేసి, ప్రసాదాలను అందజేశారు. కులమతాలకతీతంగా బాబా ఉరుసు ఉత్సవానికి భక్తజనం హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిల నారాయణరావు, సంపత్ ఖాదర్, మునిప్రవీణ్, ప్రశాంత్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పురవీధుల్లో బాబా చిత్రపటంతో భారీ ఊరేగింపు


బాబాను దర్శించుకుంటున్న అవనాపు విక్రమ్, భావన దంపతులు

అదుపు తప్పిన స్కూల్ బస్సు

- తప్పిన పెను ప్రమాదం

శృంగవరపుకోట:

నవ్వుతూ..తుళ్లుతూ ఇంటికి బయల్దేరిన చిన్నారుల స్కూల్ బస్సు ప్రమాదానికి పాల్పడడంతో అంతా భయభ్రాంతులయ్యారు. దీంతో చిన్నారులంతా ఏడుస్తూ బిక్కుబిక్కు మంటూ తమవారి కోసం రోడ్డుపై నిల్చున్నారు. అయితే బస్సులో పిల్లలంతా ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోట పట్టణంలోని రామన్ స్కూల్‌కు చెందిన బస్సు సుమారు 70మంది విద్యార్థులతో సాయంత్రం 5గంటల సమయంలో బయల్దేరింది. కొత్తూరు జంక్షన్ వరకూ వెళ్లిన బస్సు జంక్షన్‌లో రోడ్డుపై స్కూల్ పిల్లలతో ఉన్న ఆటోను ఢీకొట్టి, ఎడమవైపు ఖాళీగా ఉన్న పొలంలోకి ఒరిగిపోయింది. పిల్లల హాహాకారాలతో కొత్తూరు గ్రామస్తులు, రోడ్డున పోతున్న వారంతా హుటాహుటిన వచ్చి విద్యార్థులను బస్సు నుంచి కిందికి దింపారు. పిల్లలంతా క్షేమంగా ఉండడంతో స్కూల్ యాజమాన్యం, వారి తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళపై దూసుకుపోయిన బస్సు

కొత్తూరు వద్ద బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో ఎస్.కోట రైతుబజార్‌కు వెళ్లి వస్తున్న వెంకటరమణపేట గ్రామానికి చెందిన ఎండపల్లి వెంకటేశ్వరమ్మ ఉరఫ్ సత్యవతి పాసింజర్ ఆటో దిగింది. అదే సమయంలో వెనుకగా స్కూల్ పిల్లలతో వచ్చిన ఆటో ఆగింది. ఆ వెనుకనే వస్తున్న స్కూల్‌బస్ ముందున్న ఆటో ఒక్కసారిగా ఆగడంతో, దాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న వెంకటేశ్వరమ్మ మీదుగా దూసుకుపోయి, ఎడమవైపు పొలంలోకి ఒరిగిపోయింది. పిల్లలను బయటకు తీసిన తర్వాత బస్సు కింద ఉన్న వెంకటేశ్వరమ్మను గమనించిన స్థానికులు ఆమెను బయటకు తీసి ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్.కోట ఎస్సైలు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు.


ప్రమాదం నుంచి బయటపడి బిక్కుబిక్కు మంటున్న చిన్నారులు


అదుపు తప్పి పొలంలోకి దూసుకుపోయిన బస్సు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



లక్ష్మణరావు మృతదేహం (ఇన్‌సెట్లో) లక్ష్మణరావు(ఫైల్)

డెంకాడ: అంతవరకూ బాగానే ఉండి అందరినీ పలకరించిన ఆ యువకుడిని అంతలోనే గుర్తు తెలియని వాహనం మృత్యువై మింగేసి తల్లిదండ్రులు, సోదరికి తీరని శోకం మిగిల్చింది. పినతాడివాడ-గొడిపాలెం ఆర్అండ్‌బీ రహదారిపై పినతాడివాడ గ్రామం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. పినతాడివాడ నుంచి గొడిపాలెం వెళ్తున్న మోటార్‌సైకిల్‌ను పినతాడివాడ కళ్లాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న పినతాడివాడ గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మణరావు(17) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అదే బైక్‌పై ఉన్న మరో యువకుడికి గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఆస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ప్రమాద వార్త తెలుసుకున్న గ్రామ సర్పంచ్ లెంక లక్ష్మణరావు ప్రమాద స్థలానికి చేరుకుని, పలు విభాగాలకు సమాచారం అందజేసి మృతుడి తల్లిదండ్రులను ఓదార్చారు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు, కవల సోదరి రోదన

పినతాడివాడ గ్రామానికి చెందిన మజ్జి రామారావు, కొండమ్మ దంపతులకు రమాదేవి, లక్ష్మణరావు ఇద్దరు కవల పిల్లలు. ఈ కవలల్లో లక్ష్మణరావు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో తమ్ముడు లక్ష్మణరావును తీసుకువెళ్లిపోయి తనను ఒంటరి చేశావా? భగవంతుడా అంటూ సోదరి రామలక్ష్మి భోరున విలపించింది. అలాగే కుటుంబానికి వారసుడైన కుమారుడిని తీసుకుపోయావా దేవుడా అంటూ తల్లిదండ్రుల రోదనతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంగా మారింది.

క్లుప్తంగా

ఏకగ్రీవంగా ఎలక్ట్రిసిటీ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(1104) టెక్కలి డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నరసన్నపేటలోని కల్యాణ మండపంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం.వి.గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షునిగా దాసరి శేఖర్, కార్యదర్శిగా నక్క లోకేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అన్నెపు గోపాలరత్నం, కోశాధికారిగా మెట్ట హిమగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈశ్వరరావు, ఆఫీస్ కార్యదర్శిగా మెట్ట కరుణాకర్, కమ్యూనికేషన్ కార్యదర్శిగా వై.వాసుదేవరావు ఎన్నికయ్యారు.

ఆదిత్యుని సన్నిధిలో ఆదిపరాశక్తి పీఠాధిపతి



స్వామీజీకి జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదిపరాశక్తి క్షేత్ర పీఠాధిపతి నిత్యావిద్యానంద భారతి స్వామీజీ తన శిష్య బృందంతో బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రైల్ స్టాపేజీలు ఇవ్వాలని వినతి



డీఆర్ఎంకు వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘ నాయకులు

కాశీబుగ్గ: సోంపేట స్టేషన్‌లో ఉదయం 5 నుంచి 7 గంటల మధ్య రైల్ స్టాపేజీ కల్పించాలని బీసీ సంఘం నాయకులు బుధవారం ఖుర్దా రోడ్డు డీఆర్ఎంకు వినతిపత్రం అందించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పనుల మీద వెళ్లేవారు, అనారోగ్యంతో ఆసుపత్రులకు పోయేవారు ఉదయం రైలు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఢిల్లీ రావు, నాయకులు అమీరుల్లా బేగ్, బద్రి సీతమ్మయాదవ్, పల్లి నాగేశ్వరరావు, పురిల్ల మల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

పొందూరు: త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుండటంతో మండలంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మ గ్రామాలపై పోలీసులు దృష్టి సారించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశించారు. పొందూరు పోలీసు స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాలు చోటుచేసుకోకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రికార్డులను పరిశీలించి ఎస్సై రవికుమార్‌కు తగు సూచనలు, సలహాలిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆమదాలవలస: మండలంలోని శ్రీహరిపురం సమీపంలో అలికాం -బత్తిలి రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం మండలం రాగోలు గ్రామానికి చెందిన సంపతిరావు కృష్ణమూర్తిరాజు వాహనానికి.. ఎదురుగా వస్తున్న భామిని మండలం కాట్రగడ్డ గ్రామానికి చెందిన ఎస్.సునీల్‌కుమార్ బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడటంతో 108 సిబ్బంది ఎం.రమేష్, ఎం.అంజిబాబు ప్రథమ చికిత్స అందించి జొన్నవలస పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీచుమిల్లులో అగ్ని ప్రమాదం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బలరాంపురం జంక్షన్ వద్ద పీచుమిల్లులో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న ఇచ్ఛాపురం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.70వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకాధికారి సూర్యారావు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పాలకొండ రోడ్డులో ఓ ఎలక్ట్రికల్ షాపు వెనుక ఖాళీ స్థలంలో బుధవారం పేకాట ఆడుతూ ఐదుగురు జూదరులు పోలీసులకు పట్టుబడినట్లు రెండో పట్టణ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.17585 నగదు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇది మా భవితకు

సపోర్టు

- ఈ ప్రాంతంలో పోర్టు వస్తుందని ఊహించలేదు
- సీఎం వైఎస్ జగన్ కృషి కనిపించింది
- మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనుల సందర్శన అనంతరం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు





'మా ప్రాంతంలో పోర్టు వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు.. మా చిన్నప్పటి నుంచి పోర్టు అంటున్నారు గానీ ఎవరూ కట్టలేదు. ఇప్పుడు ఇక్కడ పనులు చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ కృషి తెలుస్తోంది. ఇక్కడ పోర్టుతో మా భవిష్యత్ కనిపిస్తోంది.'ఇదీ మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టును ఇటీవల సందర్శించిన టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల మనోగతమిది. పోర్టు పనులు చూసి ఆశ్చర్యపోయిన విద్యార్థులు పనులన్నీ పూర్తయ్యాక తమలాంటి వారికి ఇక్కడే ఉపాధి దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన 59 మంది విద్యార్థులు ఇటీవల సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టు ప్రాంతాన్ని ఇటీవల సందర్శించారు. అక్కడ పోర్టు నిర్మాణాన్ని చూసి ఎంతో ఆశ్చర్యపోయారు. వెనుకబడిన జిల్లాలో ఇంతటి నిర్మాణాన్ని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అంతా రుణపడి ఉంటామని వారు అన్నారు. పోర్టు నిర్మాణంతో జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 'మా ప్రాంతంలో పోర్టు నిర్మాణం జరుగుతుందనే విషయాన్ని వివిధ మీడియాల్లో చూస్తున్నాం తప్ప నేరుగా చూడలేదు. ఇలాంటి పోర్టు వల్ల పెద్ద ఎత్తున ఎగుమతులు, దిగుమతులు జరిగి మా లాంటి యువతకు కచ్చితంగా ఉపాధి అవకాశాలు వస్తాయి' అని అన్నారు.

భవిష్యత్ కనబడింది



మూలపేట పోర్టు నిర్మాణం చూసిన తర్వాత ఈ ప్రాంతంలో మా లాంటి యువతకు బంగారు భవిష్యత్ కనబడింది. విశాఖలో పోర్టు ఉండడంతో ఆ ప్రాంతం ఎంత అభివృద్ధి చెందిందో అందరికీ తెలుసు. భవిష్యత్‌లో మన ప్రాంతంలో అంతకంటే ఎక్కువ అభివృద్ధి జరుగుతుంది.

– ఆర్.తరంగిణి, బీఎస్సీ సెకండియర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి.



సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు ప్రాంతాన్ని సందర్శిస్తున్న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

జీవన ప్రమాణం మెరుగుపడుతుంది



మూలపేట పోర్టు నిర్మాణం ఎంతో శరవేగంగా జరుగుతోంది. జిల్లా అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు అనే విషయానికి ఈ పోర్టును నిదర్శనంగా చెప్పాలి. పోర్టు వల్ల ఈ ప్రాంతంలో అన్ని వర్గాల జీవన ప్రగతి మరింత మెరుగుపడుతుంది. – చౌదరి సుగుణధనరావు, లెక్చరర్.

ప్రభుత్వానికి హ్యాట్సాఫ్



మారుమూల ప్రాంతంలో పోర్టు నిర్మాణం చేపట్టడం ఎంతో గొప్ప విషయం. పోర్టు నిర్మాణం జరిగిన తర్వాత దానికి అనుకూలంగా ఎన్నో రకాల పరిశ్రమలు, ఇతర వర్తక, వాణిజ్య వ్యాపారాలకు ఈ ప్రాంతం సెంటర్ పాయింట్ అవుతుంది. మా చిన్నప్పటి నుంచి పోర్టు అంటున్నారే తప్పా ఎప్పుడూ నిర్మాణం చేయలేదు. మొట్టమొదటి సారిగా సీఎం వైఎస్ జగన్ ఇలాంటి పోర్టు నిర్మాణం చేస్తున్నారు. ఈ ప్రభుత్వానికి హ్యాట్సాఫ్.

– వై.మహేష్, బీఎస్సీ విద్యార్థి.

నిరుద్యోగ సమస్య తీరుతుంది



పోర్టు నిర్మాణం జరిగిన తర్వాత జిల్లాలో నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. పోర్టు నిర్మాణం తర్వాత ఏ రకంగా ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయో అక్కడ సిబ్బంది వివరించారు. ఇంతకు మునుపెన్నడూ పోర్టు చూడలేదు. మా ప్రాంతంలో నిరుద్యోగ సమస్య తీరడమే కాకుండా ఎంతో అభివృద్ధి జరుగుతుందని మాకు నమ్మకం కలిగింది. – కె.హరిప్రియ, బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిని.

విద్యార్థులకు ఉపయోగకరం



పోర్టు సందర్శన మా కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ ప్రాంతం అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న మంచి పని విద్యార్థులకు తెలిసింది. జిల్లాలో మొట్టమొదటి సారిగా మా కళాశాల విద్యార్థులే ఈ పోర్టును సందర్శించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. – టి.గోవిందమ్మ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టెక్కలి

పేద పిల్లలకు కార్పొరేట్ విద్య

- విద్యాహక్కు చట్టం అమలుకు పకడ్బందీ చర్యలు
- ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు
- 2024–25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
- ఒకటో తరగతిలో ప్రవేశాలకు అవకాశం



విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: పేద విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చదివే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యా సంవత్సరం(2024–25)కి సంబంధించి ప్రవేశాలకు ముందస్తుగా నోటిఫికేషన్ విడుదల చేసింది. 'విద్యాహక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)–సి'ని అనుసరించి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు వరం..

ప్రభుత్వ నిర్ణయంతో విద్యాహక్కుచట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. వాస్తవానికి విద్యాహక్కుచట్టం –2009 ప్రకారం ఏటా ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాల్సి ఉన్నా గత పాలకులు దీన్ని పట్టించుకోలేదు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. శ్రీకాకుళం జిల్లాలో 398 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్సీ, స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు 1వ తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉంది. ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నెల 6 నుంచి సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ కావాలని పాఠశాల విద్య కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేశారు.

ఇదీ షెడ్యూల్..

- ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14 వరకు స్టూడెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుంది.
- సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఐబీ, ఐఈఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలయ్యే ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- దరఖాస్తుతోపాటు తల్లిదండ్రుల ఆధార్/ఓటర్/రేషన్/ భూహక్కు /ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు/పాస్‌పోర్ట్ / డ్రైవింగ్ లైసెన్స్/ విద్యుత్ బిల్లు/ రెంటల్ అగ్రిమెంట్ కాపీల్లో ఒకదానిని జత చేయాలి.
- మార్చి 20 నుంచి 22 వరకు అర్హులైన విద్యార్థులను గుర్తిస్తారు.
- ఏప్రిల్ 1న లాటరీ ద్వారా అర్హుల మొదటి విడత జాబితా తయారుచేస్తారు.
- ఏప్రిల్ 2 నుంచి 10 వరకు విద్యార్థుల అడ్మిషన్లు ఖరారు చేస్తారు.
- ఏప్రిల్ 15న లాటరీ ద్వారా రెండో విడత జాబితాను వెల్లడిస్తారు.
- ఏప్రిల్ 16 నుంచి 23 వరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఖరారు చేస్తారు.



పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌పోర్టల్

సద్వినియోగం చేసుకోవాలి..



విద్యాహక్కుచట్టం ప్రకారం పేద విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించింది. ఇది పేద, మధ్య తరగతి విద్యార్థులకు వరమనే చెప్పాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, డీఈవో, శ్రీకాకుళం

చిన్నారులకు చేయూత

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తేలుకుంచి గ్రామానికి చెందిన మల్లవరపు వెంకటలక్ష్మీ అనే వివాహితను ఆమె భర్త విడిచిపెట్టగా.. సంక్రాంతి నాడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. 4, 2 తరగతులు చదువుతున్న కుమార్తెలు శరణ్య, లిఖితలు అనాథలుగా మిగిలిపోయారు. ఈ విషయమై 'సాక్షి'లో ప్రచురితమైన 'అమ్మ లేదు.. నాన్న రాడు' అనే కథనానికి దాతలు స్పందిస్తున్నారు. కేశపురం గ్రామానికి చెందిన 'శ్రీకాళీమాత సేవాసమితి' సభ్యులు బుధవారం రూ.12వేలు నగదు, నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందజేశారు.



చిన్నారులకు సాయం అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

రికవరీ బంగారం బ్యాంకుకు అప్పగింత

గార: గతేడాది నవంబర్ చివరి వారంలో గార స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు మాయమైన సంగతి తెలిసిందే. ఈ కేసులో బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై కేసు నడవడం, బంగారాన్ని అప్పగించాలని బ్యాంకు కోరడంతో కోర్టు ఆదేశాల మేరకు బుధవారం బ్యాంకు అధికారులకు పోలీసులు బంగారం అప్పగించారు. గతంలోనే 26 ప్యాకెట్లు లభించగా.. పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి మరో 62 ప్యాకెట్ల బంగారం పట్టుకున్నారు. ఈ మొత్తం బంగారాన్ని డీఎస్పీ శృతి, సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్‌లు బ్యాంకుకు వెళ్లి అప్పగించారు. ఈలోగా పలువురు ఖాతాదారులు బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. వారిని పోలీసులు, సిబ్బంది సముదాయించారు.



బ్యాంకు వద్ద ఖాతాదారులతో మాట్లాడుతున్న సీఐ, పోలీసులు

మాతృభాషకు వందనం



అమ్మభాష కమ్మదనం తెలుగుజాతి గొప్పతనమంటూ జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కవిటిలోని కల్యాణీ పాఠశాలలో చిన్నారులు అ, ఆ ఆకృతిలో ఏర్పడి ఆకట్టుకున్నారు. - కవిటి

ఆర్ట్స్ కళాశాలలో స్కిల్ క్వెస్ట్

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థి దశలోనే విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలో స్కిల్ క్వెస్ట్ (ఎంటర్, ఎక్స్‌ప్లోర్, ఎర్న్) పేరిట విద్యార్థులు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారు. మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన ఫలితాల కోసం అధ్యాపక బృందం చేస్తున్న కృషిని కొనియాడారు. సరైన ఆలోచన, శిక్షణ ఉన్నప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని చెప్పారు. పెరుగుతున్న జనాభాతో పాటు ఉద్యోగాల కొరత ఏర్పడిందని, ఈ తరుణంలో సరైన నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా కాకుండా ప్రైవేటు జాబ్‌లు చేసేందుకు కూడా యువత సిద్ధంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ మాట్లాడుతూ స్కిల్ క్వెస్ట్ కార్యక్రమ ఉద్దేశం వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైఎస్సార్‌పీసీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, విద్యావేత్త సురంగి మోహన్‌రావు, ఉకలాపు గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డాక్టర్ హరిత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్టాల్ వివరాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

అచ్చెన్నాయుడి రిగ్గింగులు సాగనివ్వం



హరిశ్చంద్రపురం వైస్‌సర్పంచ్ రామారావుకు వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్

కోటబొమ్మాళి : రానున్న ఎన్నికల్లో నిమ్మాడ సమీప గ్రామాల్లో అచ్చెన్నాయుడి రిగ్గింగులు సాగనివ్వబోమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్, శ్రీకాకుళం పార్లమెంటరీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. బుధవారం కోటబొమ్మాళి మండలం చిన్న హరిశ్చంద్రపురంలో వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హరిశ్చంద్రపురం వైస్ సర్పంచ్ మొగిలి రామారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు సోమవారం తమ గ్రామానికి వచ్చి బలవంతంగా టీడీపీ కండువా వేశారని, తనకు జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఇష్టమనిర, అందుకే మళ్లీ ఈ రోజు వచ్చి వైఎస్ఆర్ సీపీ కండువా వేసుకున్నట్లు స్పష్టం చేశారు.

మహా శివరాత్రికి ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: మార్చి 8న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా దేవదాయశాఖ అధికారి బి.ఆర్.వి.వి.ప్రసాద్ పట్నాయక్ బుధవారం తెలిపారు. రావివలస ఎండల మల్లికార్జుస్వామి, శ్రీముఖలింగం, ఉమారుద్రకోటీశ్వరస్వామి ఆలయాల్లో క్యూలైన్ల ఏర్పాట్లు చేయనున్నామని, ఈ విషయమై త్వరలో ఈవోలతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎనర్జీ అసిస్టెంట్‌కు గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని తలగాం సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టెక్కలి శ్రీనివాసనగర్‌కు చెందిన ఎండ దిలీప్ విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. పెద్దరోకలపల్లి పంచాయతీ రామ్‌నగరంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో సరిచేసేందుకు దిలీప్ సిబ్బందితో కలిసి వెళ్లాడు. ఏబీ స్విచ్ ఆపి లైన్ సరిచేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు

- క్యాన్సర్, గుండె, నరాలు, కిడ్నీలకు స్థానికంగానే చికిత్సలు
- 10 మంది వైద్యులు చేరిక
- త్వరలో మరో ఆరు పోస్టులు భర్తీ

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ మెడికల్ కళాశాలలో గురువారం నుంచి నూతనంగా స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్డియాలజీ, న్యూరాలజీ, అంకాలజీ వంటి విభాగాల్లో గతంలోనే పోస్టులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. వీటిని కొద్ది రోజుల క్రితం భర్తీ చేయడంతో 10 మంది వైద్యులు విధుల్లో చేరారు. వీరికి గదులు కూడా కేటాయించడంతో గురువారం నుంచి వైద్య సేవలు అందించనున్నారు. ఆయా వ్యాధులకు సంబంధించిన ఓపీ ప్రారంభం కానుంది. దీంతో గుండె మార్పిడి శస్త్రచికిత్సలు, స్టంట్లు వేయడం, క్యాన్సర్ శస్త్రచికిత్సలు, కిమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలు జరగనున్నాయి. కొత్తగా మరో స్పెషాలిటీ వైద్యులు పోస్టులు కూడా త్వరలోనే భర్తీ చేయనున్నారు. ఈ విషయమై రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వామినాయుడు మాట్లాడుతూ గురువారం నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలంతో కలిసి తాను ఈ సేవలను ప్రారంభిస్తామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేసుల పరిష్కారమే లక్ష్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించడమే లక్ష్యమని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మార్చి 9న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో బుధవారం రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు శ్రీకాకుళంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు జ్ఞాన సువర్ణ రాజు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రీ లోక్ అదాలత్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రిమినల్, మోటారు ప్రమాద కేసుల్లో కక్షిదారులను పిలిపించి రాజీ చేసేందుకు ప్రయత్నాలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.